28072024-DIS-04_Layout 1 7/28/2024 3:30 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# మేధావులు శ్వేతపత్రం ఇవ్వగలరా?

**తెలంగాణపై మేధావులు ఒక శ్వేతపత్రం ఇవ్వగలరా? సాధారణంగానైతే శ్వేతపత్రాలు ఇచ్చేది ప్రభుత్వాలు. లేదా ఏదో ఒక అధికారంలో ఉండేవారు. అటువంటి స్థితిలో మేధావులను ఇవ్వమనటం ఆశ్చర్యం కలిగించవచ్చు. అయినప్పటికీ అట్లా కోరటం ఎందుకో చూద్దాము. శ్వేతపత్రం అనేదానిలో ఆ నిర్దిష్ట విషయంపై అందుకు సంబంధించిన సమస్త స్థితిగతులను పొందుపరచాలి. ఆ పనిచేయటంలో ఎటువంటి దాపరికాలు, రాగద్వేషాలు ఉండరాదు. వాస్తవాలను, గణాంకాలను ఎత్తి చూపటం, అవసరమైన విశ్లేషణలు మినహా బహుశా ఎటువంటి వ్యాఖ్యానాలు చేయకూడదు. తెలంగాణ విషయానికి వస్తే, గత పదేండ్ల తమ పరిపాలన గురించి బీఆర్ఎస్ అనేక వివరాలు చెప్పింది, ఇప్పటికీ చెప్తున్నది. మరొకవైపు కాంగ్రెస్ తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆ వివరాలను ఖండిస్తూ విమర్శలు చేసింది. ఇప్పుడు అధికారానికి వచ్చిన తర్వాత శ్వేతపత్రాలు విడుదల చేసింది. ఇతర అంశాలపై విమర్శలు కొనసాగిస్తున్నది. ఉభయులు చెప్తున్నవి పరస్పర విరుద్ధంగా ఉన్నందున ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. కనుక ఈ సమస్య తీరటానికి మేధావుల శ్వేతపత్రం అవసరం.**



టంకశాల అశోక్

ప్రజలు బీఆర్ఎస్ చెప్తున్నది, ప్రభుత్వం చెప్తున్నది ఏమి నమ్మినా నమ్మకపోయినా అనేక సందేహాలుండటం సహజం. అవి తీరటం ఒక తప్పనిసరి అవసరం. అంతిమంగా ఈ రాష్ట్రం వారిది. ప్రస్తావనలలోకి వస్తున్న విషయాలు ఆషామాషీవి కావు. ప్రజల వర్తమాన జీవితాలకు, భవిష్యత్తుకు సంబంధించిన సీరియస్ విషయాలు. వారి గతకాలపు పోరాటాలకు, వర్తమాన ఆరాటాలకు సంబంధించినవి. అందువల్ల, రెండువైపుల నుంచి వినవస్తున్న మాటలలోని సత్యాసత్యాలేమిటో ప్రజలకు తేటతెల్లం కావాలి. ఈ పనికి మేధావులు తటస్థ వైఖరితో పూనుకోవాలి. ప్రజలకు తమ నిత్య జీవితానుభవాల ద్వారా అనేక విషయాలు సహజరీతిలో తెలిసివచ్చే మాట నిజమే. అదే సమయంలో, వారి సాధారణ దృష్టికి తెలియరానివి, బోధపడనివి కూడా కొన్ని ఉంటాయి. ఉదాహరణకు గణాంక వివరాలు, వాటి విశ్లేషణలు. అందువల్ల వారు తమ వైపు నుంచి శ్వేతపత్రం ఒకటి తయారుచేసి ప్రజల ముందుకుతేవాలి.

ఇందులో ఒక సమస్య ఉండవచ్చు. అధికారంలో ఉన్న లేదా ఉండినవారికి లభ్యమయ్యే వివరాలన్నీ మేధావులకు అందుబాటులో ఉండని మాట నిజం. కానీ ఆ కొరతను ప్రస్తుత సందర్భంలో చాలావరకు అధిగమించవచ్చు. ఎందుకంటే, ఉభయులు కూడా ఈ పదేండ్లలో తమ ప్రకటనలు, నివేదికలు, విమర్శలు శ్వేతపత్రాల రూపంలో అన్ని విషయాలు, గణాంకాలు వెల్లడించినట్లే భావించాలి. ఇవిగాక ఇదే కాలంలో కేంద్రానికి చెందిన వివిధ మంత్రిత్వ శాఖలు, పలు ఇతర సంస్థలు తమ నివేదికలను, సమాచారాలను వెల్లడిస్తూ వస్తున్నాయి. ఇక్కడ రాష్ట్రంలోనూ కొన్ని ప్రభుత్వేతర సంస్థలు ఆ పనిచేస్తున్నాయి. ఆ విధంగా, పబ్లిక్ డొమైన్ అనే దానిలో లేనిదంటూ బహుశా ఇంకేమీ లేకపోవచ్చు. ఒకవేళ అరకొర ఉన్నా, మేధావుల శ్వేతపత్రం తయారీకి అది పెద్ద కొరత కాబోదు. కనుక వారందుకు సమకట్టాలి. ఈ కార్యానికి నిధులెట్లా అని వారు సంశయించటం సరికాదు. తెలంగాణ అధ్యయనం పేరిట పరిశోధనా సంస్థల నుంచి ఫండింగ్ తెచ్చుకోగలరు వారు. యూనివర్సిటీల నుంచి ఫెలోషిప్‌లు, స్కాలర్‌షిప్‌లు సంపాదించగలరు.

> **వాస్తవానికి వారిందుకు ఎప్పుడో శ్రీకారం చుట్టవలసింది. ఆ పని మేధావులుగా వారి కర్తవ్యం. ఆ పని చేయకుండా కొందరు ఒక పక్షాన్ని, కొందరు మరో పక్షాన్ని ప్రశంసిస్తూ, లేదా విమర్శిస్తూ పోయారు. ఏ పక్షమూ వహించకుండా రాష్ట్రం కోసం, ప్రజల కోసం, తమ మేధావి బాధ్యతల నిర్వహణ కోసం, జరుగుతున్నవాటిపై గాని, జరగని వాటిపై గాని, జరగవలసిన వాటిపై గాని, అధ్యయనాలు చేసినవారు ఒక్కరంటే ఒక్కరైనా లేకపోయారు.**

ఒక్కరే అన్నిరంగాలను అధ్యయనం చేయటం అసాధ్యం. ఎవరి రంగంపై వారు చేయటం తప్పకుండా సాధ్యమే. అందుకు అవసరమయ్యే కొద్దిపాటి వనరులను వారు వ్యక్తిగతంగా సమకూర్చుకొనగలరు. తమ జీతభత్యాలను, పింఛన్లను, ఇతర ఆదాయాలుంటే వాటిని కొద్దిగా ఖర్చు చేస్తూ. ఉద్యమకాలమంతా ఎన్నెన్నో త్యాగాలు చేసినవారు, ఇప్పుడీ చిన్నపాటి త్యాగం చేయలేరా? దానిని శ్వేతపత్రం కాకుంటే పోనీ అధ్యయన పత్రమనండి.

దురదృష్టవశాత్తు ఏమంటే, మేధావులలో అధికులు తమ విమర్శనా బాధ్యతలనైతే సరిగానే నిర్వహించారు గాని, అధ్యయన బాధ్యతలను పూర్తిగా విస్మరించారు. దానితో ఆ విమర్శలకు అవసరమైన ఆధారాలు ప్రజల ముందు వారు తేలేదు. తేలేదంటే ఆధారాలు లేవని కాదు. కానీ ఉన్నా తీసుకురానట్లయితే ఆ విమర్శలు మామూలు భాషలో చెప్పాలంటే గాలి విమర్శలుగా మిగులుతాయి. లేదా, సాధారణ రాజకీయ ప్రచారాలు, ఉద్దేశపూరిత వ్యాఖ్యలవుతాయి. వాటికి విశ్వసనీయత ఉండదు. మనకు ఇదే ధోరణి కనిపిస్తూ వచ్చింది. అది చివరికి ఒక పార్టీ ఎన్నికల ప్రచార రథాలకు జెండాలూపటం వరకు వెళ్లింది. మేధావులకు రాజకీయ విశ్వాసాలు, సానుభూతులు ఉండరాదని కాదు. కానీ, అంతకన్న ముఖ్యంగా, వారి మౌలికమైన సానుభూతి, మద్దతు ప్రజలతో ఉండాలి.

ఇప్పుడు నిర్దిష్టంగా కొన్ని విషయాలు చూద్దాము. మేధావులు తమ శ్వేతపత్రం లేదా అధ్యయన పత్రం తయారీకి పరిగణనలోకి తీసుకోవలసిన విషయాలేమిటి? తెలంగాణ పరిస్థితి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడకముందేమిటి? ఏర్పడినాక బీఆర్ఎస్ పాలనలో ఏమిటి? కాంగ్రెస్ అధికారానికి వచ్చిన తర్వాత ఏమి జరుగుతున్నది? రాగల కాలంలో జరగవలసిందేమిటి? ఎట్లా జరగాలి? అనేది ఒక విధమైన వర్గీకరణ. పరిశీలించవలసిన ప్రధానరంగాలు వ్యవసాయం, పరిశ్రమలు, సర్వీస్‌రంగం, సంక్షేమం అనుకుంటే అదొక స్థూల వర్గీకరణ. వీటిలోని పలు ఇతర ముఖ్యాంశాలను కూడా గుర్తించి పరిశీలించవలసి ఉంటుంది. అవి నీటి పారుదల, విద్యుత్తు, రైతు సంక్షేమం, వ్యవసాయ ఆర్థికరంగంపై, గ్రామీణ ఆర్థికరంగంపై ఆధారపడే వృత్తులు, పారిశ్రామిక విధానం, పరిశ్రమలకు మౌలిక వసతుల కల్పన, ఐటీ, ఇతర సర్వీస్ రంగాల విధానం, వాటికి మౌలిక వసతులు, పట్టణాభివృద్ధి, రోడ్లు, పరిపాలనాభివృద్ధి, నీతి, అవినీతులు, వ్యాపారాలకు ప్రోత్సాహం, విద్య, వైద్యం, ఉద్యోగ నియామకాలు, ఉపాధి అవకాశాల మెరుగుదలలు, తెలంగాణ సంస్కృతి పునరుజ్జీవం, కళాసాహిత్యాల ప్రోత్సాహం, బడుగు, బలహీనవర్గాల సంక్షేమం, పేదరికం తగ్గింపు, వివిధ మానవాభివృద్ధి సూచీల మెరుగుదల వివిధరంగాలలో అభివృద్ధి సూచీల మెరుగుదల, మానవ హక్కులూ స్వేచ్ఛల పరిస్థితి, శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా సమస్యలకు స్పందనలు, ఉమ్మడి రాష్ట్రంతో గాని, ఇతర రాష్ట్రాలతో గాని, జాతీయ సగటుతో గాని పోల్చినట్లయితే స్వరాష్ట్రం ఏర్పడినప్పటినుంచి ఏ సూచీలలో మెరుగుపడ్డాము, ఎందులో వెనుకపడ్డాము, ఎక్కడ మార్పు లేదు– ఇట్లా అనేకానేక అంశాలను ప్రజల దృష్టినుంచి, వారికి వాస్తవాలు తెలియజెప్పాలనే ఆలోచనతో, నిజాయితీగల మేధావులుగా వారు పరిశీలించి చెప్పటం అవసరం.

> **వారు ఆ పాత్ర నిర్వహించకపోవటం వల్లనే సమస్య వస్తున్నది. వేర్వేరు విషయాలపై విమర్శలు చేస్తూ వస్తున్నవారు, ఇంతవరకు కనీసం ఒక్క అధ్యయనపత్రమైనా తయారు చేయకపోవటంపై ఏమనుకోవాలి. విమర్శలతో పాటు ఈ పని కూడా చేయవచ్చు గదా? విమర్శలైనా పాక్షికంగా, పక్షపాతంగా ఉంది, జరిగిన మంచిని అణుమాత్రమైనా గుర్తించక, కాంగ్రెస్ పాలనలో ఎన్ని వైఫల్యాలున్నా దేని గురించి కూడా మాట్లాడని వారి గురించి ఏమని చెప్పగలం? చెప్పకొనేందుకు చాలానే ఉన్నాయి. కొద్ది మాటలు మాత్రం మాట్లాడుకొని తక్కినవన్నీ వారి శ్వేతపత్రానికి లేదా అధ్యయన పత్రానికి వదిలివేద్దాం. వారు ఆ పని చేయటం స్వయంగా తమ వ్యవహార ధోరణిపై కూడా శ్వేతపత్రమవుతుందని గుర్తించాలి.**

మొదట మేధావులు ప్రచార రథాలకు జెండాలూపిన అంశాన్ని ఒక నమూనాగా తీసుకుందాము. ఆ రథాలలో వెళ్లినవారు నిరుద్యోగులని తెలిసిందే. వారిది తప్పక తీవ్రమైన సమస్యే. కనుక వారి ఆందోళన, అందుకు మేధావుల మద్దతు సరైనవే. కానీ, తర్వాత ఏమైందన్నది ప్రశ్న. గత డిసెంబర్ ఆరంభంలో అధికారానికి వచ్చిన కాంగ్రెస్, ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలివ్వగలమన్నది. ఇప్పటికి ఏడు నెలలు పూర్తవుతుండగా కొత్త ఉద్యోగం ఒక్కటైనా ఇవ్వలేదు. గత ప్రభుత్వ నోటిఫికేషన్లను తమవిగా చెప్పుకొంటూ ఎటువంటి బెరుకు లేకుండా ప్రతిరోజు అబద్ధాలాడుతున్నది. అది బుకాయింపని స్వయంగా అదే నిరుద్యోగులు పదే పదే ఖండిస్తున్నారు గాని, ఈ మేధావుల బృందానికి మాట్లాడబుద్ధి కావటం లేదు. ఎందువల్లనో తెలియదు. ఇక మిగిలిన అయిదు మాసాల్లో ఎన్ని ఉద్యోగాలు ఇవ్వగలరని, నెలకు నాలుగు వేల భృతి మాట మొన్నటి బడ్జెట్‌లోనైనా ఎందుకు లేదని కూడా నిరుద్యోగులు అడుగుతున్నారు. వారు వీధులలోకి వచ్చి ఆందోళనలు చేస్తున్నా మేధావులు మాట్లాడటం లేదు. ఈ మౌనంలో ఏమైనా రహస్యం ఉందేమో వారికే తెలియాలి.

గడువులు పెట్టి మరీ ఇచ్చిన హామీల అమలు పరిస్థితి ఏ విధంగా ఉన్నదో మన మేధావులకు ఎవరూ చెప్పనక్కరలేదు. ప్రజలను ఎన్నో సమస్యలకు గురిచేస్తున్న ఆ వైఫల్యాలపై తాము ఎందుకు ఈ విధంగా భీష్మించిన మౌనం వహిస్తున్నారో వారే ప్రజలకు చెప్పాలి. పోతే, దశాబ్దాల పాలనలో పౌర హక్కులను పలు విధాలుగా అణచివేసి, అనేక అణచివేత చట్టాలను తెచ్చి, వేలాది నక్సలైట్లను ఎదురుకాల్పుల పేరిట చంపి, జైళ్లలో విచారణలు లేకుండా నిర్బంధించి, అసలు, ఈ దేశంలో పౌర హక్కుల ఉద్యమాల ఆరంభానికే స్వయంగా కారకులైనవారు, ఇక పౌర హక్కులను పునరుద్ధరించగలరంటూ బలపరిచిన మన మేధావులు, గత ఏడు నెలలుగా నక్సలైట్ పార్టీల ప్రకటనలను గమనిస్తూనే ఉంటారు. ఇతరత్రా కూడా హక్కుల పరిరక్షణ ఎంత గొప్పగా సాగుతున్నదో కనీసం కొన్ని సందర్భాలలో తాము కూడా అనుభవిస్తున్నదే. అయినా వారు మాట్లాడరు.

ఇక బీఆర్ఎస్ పాలనలో 'అంతా సర్వనాశనం, అంతా సర్వనాశనం' అంటూ విమర్శించి, ఒక్కటంటే ఒక్క మంచినైనా గుర్తించనిరాకరించిన వారి దృష్టికి తీసుకువెళ్లేందుకు వివిధరంగాలలో డజన్ల కొద్దీ విశేషాలు ఉన్నాయి గాని, కొత్తగా ఈ నెల 27వ తేదీ శనివారం నాడు వెలువడిన ఒకే ఒక్క వార్తను ఇక్కడ పేర్కొందాము. అది స్వయంగా ప్రభుత్వమే విడుదల చేసిన తాజా ఆర్థిక–సామాజిక సర్వే. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో వివిధరంగాల అభివృద్ధి గురించి, ఇతర రాష్ట్రాలలో, జాతీయ సగటుతో పోల్చినప్పుడు గల మెరుగైన ఫలితాల గురించి, అందులో చాలా వివరాలున్నాయి. అవన్నీ అధికారపక్షంగాని, మన మేధావి బృందం గాని దాచలేని నూటొక్క నిజాలు. ఇటువంటివి ఇతరత్రా ఇంకా అనేకానేకం ఉన్నాయి. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. మేధావులు శ్వేతపత్రమనేది రూపొందించే నిజాయితీని, సాహసాన్ని చూపితే, ఇవన్నీ తెలంగాణ ప్రజల మేలును కోరి వారి దృష్టికి తెచ్చినవారవుతారు.



# వికసిత భారత్ ఎలా సాధిస్తారు?

> **EMPLOYMENT అనే ఆక్రోనింను ఆధారం చేసుకుని వాటి అమలుకు చిత్తశుద్ధితో పని చేస్తామనే వాగ్దానంతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఏడోసారి బడ్జెట్‌ను 23 జూలై రోజు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఆక్రోనిం అక్షరక్రమ విస్తరణ రూపంలో విద్య, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, ఉత్పాదకత, భూమి, అవకాశాలు, యువత, మధ్యతరగతి, శక్తి, నూతన సంస్కరణలు, సాంకేతికత వంటి పది అంశాలలో వికాసం కోసం కేటాయింపులు జరిపామని చెప్పుకొచ్చారు. గతంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు పైవాటిలో 7 అంశాలను తీసుకుని సప్తర్షి సాధన అని నామకరణం చేశారు. వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో వేగంగా దూసుకెళ్తున్నామని గ్రామాలను, పేదలను, రైతులను, నయా మధ్యతరగతి వర్గాలకు మరింత సమృద్ధిని కలిగించే దిశలో ఈ బడ్జెట్ ఒక శక్తిగా పని చేస్తుందని ప్రధాని మోదీ అన్నారు.**

కానీ, రాజ్యాంగ పీఠిక, సంక్షేమ రాజ్య సిద్ధాంతాల వెలుగులో మోదీ బడ్జెట్‌ను పరిశీలిస్తే అనేక విస్మయకర, తిరోగమన, వివక్ష, ప్రతీకార, అభద్రత, ఫాసిస్ట్ ధోరణులు స్పష్టమవుతున్నాయి. 2014 నుంచి కొనసాగుతున్న ఎన్డీయే పాలనలో మానవ జీవన ప్రమాణాల కొలమానాలలో తీవ్రమైన వెనుకబాటు దిశ ఉన్నది. దీన్ని విస్మరిస్తూ దేశం పలు రంగాల్లో అగ్రగామిగా ఉన్నదనే అందమైన అబద్ధాలను చెప్పి దేశ ప్రజలను నమ్మించే ప్రయత్నం నిరాఘాటంగా చేస్తున్నది. సమాఖ్య వ్యవస్థను అపహాస్యం చేస్తూ దక్షిణాది రాష్ట్రాలకు మొండిచెయ్యిని చూపింది. కేంద్రానికి వస్తున్న పన్నుల ఆదాయంలో అత్యధిక వాటా దక్షిణాది రాష్ట్రాలదే. దశాబ్దాలుగా పలురకాల వివక్షను, అణచివేతను అనుభవించిన తెలంగాణకు బడ్జెట్ ఏడుపునే మిగిలించింది. 8 సీట్లను కట్టబెట్టిన తెలంగాణకు నిధుల కేటాయింపులో భరించలేని వివక్షను చూపుతున్నది. కేంద్రానికి వస్తున్న పన్నుల, సేవల ఆదాయంలో సగంపైగా శ్రామిక ఉత్పాదకవర్గాల నుంచి వస్తున్నది. కానీ వీరికి సామాజిక భద్రత విద్య, వైద్యం అందించే అంశాలలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది.

> **సార్వత్రిక విద్య, వైద్యం సంక్షేమరాజ్య పునాదులు అని ఆర్థిక సర్వే తేల్చిచెప్పింది. ప్రజలు తమ సంపాదనలో 75 శాతం వెచ్చిస్తున్నారని చెప్పింది. భారత్‌లో వ్యాపారవేత్తలు, పారిశ్రామిక అధిపతులు లాభాల సముద్రంలో విహరిస్తున్నారని కూడా ప్రస్తావించింది. కానీ బడ్జెట్‌లో ఈ అంశాలను కనీసం పరిగణనలోకి తీసుకోలేదు. జీడీపీలో విద్యకు 6 శాతం, వైద్యానికి 3 శాతం నిధులు కేటాయించాలని సూచించింది. విద్య, వైద్యం ఆధారంగా వెలువరించే మానవాభివృద్ధి సూచిక–2024లో భారత్ 134వ స్థానాన్ని కలిగి ఉన్నది. ఈ సూచిక ఎన్డీయే కాలంలో క్షీణిస్తూ పోతున్నది. విద్యకు రూ.1,25,638 కోట్లు, వైద్యానికి రూ.89,287 కోట్లు కేటాయించారు. ఇవి జీడీపీలో ఒక శాతం లోపే ఉంటాయి.**

ఉమ్మడి జాబితాలోని విద్యపై కనీస పట్టింపు లేదు. పీఎం పోషణ్, రాష్ట్రాల యూనివర్సిటీలకు నిధులను భారీగా తగ్గించారు. ఆయుష్మాన్‌భవ, స్వస్థసురక్ష పథకాలకు కూడా నిధులను తగ్గించారు. గ్రామీణ ప్రజలపై బడ్జెట్ తీవ్ర కక్షపూరితంగా వ్యవహరించింది. కూలీల కొనుగోలు శక్తిని పెంచే గాంధీ ఉపాధి హామీ పథకానికి రూ.86 వేల కోట్లను ఇచ్చింది. ఇవి 20 రోజుల పనిని కూడా కల్పించలేవు. ఇటీవల బీజేపీ ఓడిపోయిన పార్లమెంట్ స్థానాలన్నీ కూడా గ్రామీణ ప్రాంతాలే. కసితో సర్కారు ఆ ప్రజలపై సర్జికల్ స్ట్రయిక్ చేసినట్టున్నది. వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు పింఛన్ ఇచ్చే నేషనల్ అసిస్టెన్స్ కార్యక్రమానికి నిధులను పెంచలేదు. రైతుల ఉసురు తీస్తూ వచ్చిన మోదీ ఈసారి 20 లక్షల కోట్ల రుణ సౌకర్యం కల్పిస్తామని చెప్పడం విడ్డూరం. ఇది మరొకసారి రైతులను మభ్యపెట్టేదిగా ఉంది. 2023–24 బడ్జెట్ కేటాయింపులతో పోల్చితే ఈసారి ఎరువుల సబ్సిడీ భారీగా తగ్గించారు. ఆహార సబ్సిడీకి ఏడు వేల కోట్ల కోత పెట్టారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు 4 శాతం నిధులను తగ్గించారు. దీనివల్ల రైతులకు పెట్టుబడి ఎక్కువై, వారి నిజ ఆదాయం తగ్గుతుంది. వ్యవసాయరంగ ఆధార అభివృద్ధితో పారిశ్రామిక ప్రగతి వైపు దృష్టి సారించాలనే స్పృహ బడ్జెట్‌లో ఏ మాత్రం లేదు. మొత్తం మీద రాజ్యాంగ వ్యతిరేక, ఫాసిస్ట్ అనుకూల ధోరణులకు పరాకాష్ఠగా కేంద్రం ఈ బడ్జెట్‌ను రూపొందించింది.



అస్నాల శ్రీనివాస్
96522 75560

**గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కులగణన చేస్తామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌నూ విడుదల చేసింది. ఎన్నికల్లో బీసీల ఓట్లను దండుకునేందుకే ఈ వాగ్దానాలు చేసిందా? లేక ఆయా వర్గాలకు న్యాయం చేయడానికి చిత్తశుద్ధితో ఇచ్చిన వాగ్దానాలను అమలుచేస్తుందా? అని రెండు కోట్ల మంది బీసీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ విధిగా ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.**

# సమవాటాకై సమరం!



జూలూరు గౌరీశంకర్




కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు సమ వాటా ఇవ్వకుండా ఆ ఎన్నికలను నిర్వహిస్తే ఆ పార్టీ బడుగు, బలహీన వర్గాలను మరొకసారి మోసం చేసినట్టుగానే భావించాల్సి వస్తుంది. 2023 ఎన్నికల ప్రచారంలో తెలంగాణలో పర్యటించిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కులగణన చేస్తామని ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని జగిత్యాల, వరంగల్ జిల్లా పర్యటనల్లో రాహుల్‌గాంధీ గట్టిగా చెప్పారు. దేశంలో సగానికి పైగా ఉన్న బీసీ జనాభాను తమ వైపునకు తిప్పుకోవటం తప్ప మరో దారి లేకనే కాంగ్రెస్ బీసీ కులగణనను నినాదాన్ని ఎత్తుకున్నదన్న భావన బీసీ ఆలోచనాపరుల్లో ఉన్నది.

2023 ఎన్నికల్లో కామారెడ్డిలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్ సుప్రీం తీర్పుకు విరుద్ధమైనది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థల్లో విద్య, ఉద్యోగ రిజర్వేషన్లలో మొత్తంగా 50 శాతం రిజర్వేషన్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ 50 శాతం మించకూడదని సుప్రీంకోర్టు మార్గదర్శకాలుండగా 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇస్తామనటం పూర్తిగా సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమైనది. బీసీలకు స్థానిక సంస్థల్లో సమ వాటా కేటాయించాలంటే ముందుగా పార్లమెంటులో పంచాయతీరాజ్ చట్టాన్ని రాజ్యాంగ సవరణ చేయాలి. అది జరుగకుండా బీసీ రిజర్వేషన్లు పెంచటం అసాధ్యం. బీసీలకు గ్యారెంటీ పథకాలు ప్రకటించినట్టుగానే బీసీ కులగణన, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇస్తామని పదే పదే చెప్పారు. బీసీ వర్గాలను తమవైపు తిప్పుకునేందుకు చేసిన ప్రయత్నమే తప్ప ఇది మరొకటి కాదని కాంగ్రెస్ చరిత్ర తెలిసిన వారెవరికైనా ఇట్టే తెలిసిపోతుంది. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉందని నిరూపించదలచుకుంటే బీసీ కులగణనను వెంటనే చేపట్టాలి. బీసీ కులగణన చేయకుండా, బీసీ సామాజికవర్గాల లెక్కలు తేల్చకుండా 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఎలా ఇస్తారు? బీసీలు 50 శాతానికి పైగా ఉంటే 42 శాతం రిజర్వేషన్లు ఎట్లా ఇస్తారు? ఇందుకు సంబంధించిన, సమగ్రమైన అధ్యయనం జరుగకుండా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు సాధ్యం కావు. ఒకవేళ ఓటరు లిస్టుల ఆధారంగా బీసీల లెక్కలు తీసే వేరే పద్ధతి చేపట్టినా బీసీలలో ఉన్న 130 కులాల సమగ్ర సమాచారం తెలియదు. ఇందుకోసమైనా హౌజ్‌హోల్డ్ సర్వే చేయవలసి ఉంటుంది. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వటమే కాకుండా అన్ని బీసీ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తామని కూడా కాంగ్రెస్ పార్టీ చెప్పింది. రాష్ట్రంలో 130 బీసీ కులాలకు సంబంధించి ఇప్పటివరకు 7 నుంచి 10 బీసీ కులాలు తప్ప 120 కులాలకు ఇంతవరకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం లేదు. పంచాయతీ సభ్యులుగా కూడా అడుగుపెట్టని బీసీలు, అత్యంత వెనుకబడిన బీసీలు, సంచార, అర్ధ సంచార బీసీలున్నారు. వీళ్లందరి లెక్కలు తీయాలి. ఏ కులం జనాభా ఎంత ఉంది? జనాభా దామాషా పద్ధతిలో ఏయే కులానికి ఎన్ని సీట్లివ్వాలో తేల్చితేనే అన్ని బీసీ కులాలకు సమప్రాధాన్యం ఇచ్చినట్టవుతుంది. ఈ పని చేయకుండా బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఎట్లా నిర్ధారిస్తారో కాంగ్రెస్ పార్టీనే ప్రజలకు సమాధానం చెప్పాలి. బీసీలు మరొక్కసారి మోసపోకుండా బడుగులు తమ చైతన్యాన్ని పదును పెట్టుకోవాలి. సంఘటితంగా స్థానిక సంస్థల్లో తమ వాటా తాము సాధించుకోవాలి.

> **గత అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి బీసీ డిక్లరేషన్, నాగ్‌పూర్ బీసీ డిక్లరేషన్, ఉదయపూర్ బీసీ డిక్లరేషన్లను చేసింది కాని ఆచరణలో మాత్రం శూన్యం. తను చెప్పిన మాటపై నిలిచిందా చూడాలి. ఉదయపూర్ డిక్లరేషన్ ప్రకారం ప్రతి ఎంపీ సెగ్మెంట్‌లో రెండు ఎమ్మెల్యే స్థానాలను బీసీలకు ఇస్తానన్నది. తెలంగాణలో ఎన్ని సీట్లిచ్చిందో చూశాం. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌తో 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇస్తానన్నది. ఇది కులగణన జరగకుండా సాధ్యం కాదు.**

కులగణన జరిగితే అది సామాజిక మార్పునకు సంకేతమవుతుంది. దేశ పాలకులు వాగ్దానాలు ఎన్నయినా చేస్తారు కానీ బీసీలకు సంబంధించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాలను చేయటంలో మాత్రం ముందుకురారు. దేశంలోని బీసీ సమస్యలు ఇన్నేండ్లు నాన్చి తొక్కేసింది కాంగ్రెస్ అయితే, రిజర్వేషన్లు అమలు జరిపేందుకు ఒప్పుకోమని బీజేపీ తెగేసి చెప్తున్నది. కులగణనను చేస్తారని బీసీలు ఆశగా ఎదురుచూడటం సహజమే కానీ, చరిత్ర పేజీలు తిరగేస్తే కాంగ్రెస్ ఆ పని చేస్తుందనే నమ్మకం లేదని తెలుస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్కసారిగా 6 వేలకు పైగా గ్రామ రాజ్యాలు బీసీల చేతుల్లోకి పోవడం ఆధిపత్య వర్గాలు జీర్ణించుకోలేని విషయం. అందుకే ఏదో ఒకరకంగా అడ్డుపడి తీరుతాయి. రాజకీయాలను పక్కనపెట్టి బీసీలంతా ఐక్యమై ఒక్కతాటిపై నిలిచి పోరాడినప్పుడే కులగణనతో పాటుగా 6000 స్థానిక రాజ్యాలు బీసీల చేతుల్లోకి వస్తాయి. ఇది ఒకరకంగా గ్రామీణ తెలంగాణ రాజకీయ వ్యవస్థలో పెను విప్లవంగా మారుతుంది. ఇది తెలంగాణ సమాజానికి కొత్త మలుపు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్‌ది కపట బుద్ధి



పిన్నింటి విజయ్‌కుమార్
90520 39109

'తలాపున పారుతుంది గోదారీ.. నీ చేను నీ చెలుక ఎడారి' అంటూ తెలంగాణ ఉద్యమంలో పాటలు కైగట్టి పాడుకున్నాం. నీళ్ల విషయంలో తెలంగాణ పడుతున్న గోసను చూసి దేశమే కన్నీళ్లు పెట్టుకున్నది. నీళ్ల కోసమే రణం చేసిన మన తెలంగాణ 2014 కంటే ముందు ఎడారి ప్రాంతమే. ఉద్యమ నేతగా కేసీఆర్ నీళ్ల కోసం తెలంగాణ జనం పడుతున్న అరిగోసను చూసి ఎక్కెక్కి ఏడ్చిన సందర్భాలున్నాయి. అట్లాంటి సందర్భం నుంచి తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నీళ్ల కోసం అహర్నిశలు కృషిచేశారు. గోదావరి నీళ్లను ఎత్తిపోయడమే తెలంగాణకు ఉన్న ఏకైక మార్గమని దేశంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకాన్ని రూ.94 వేల కోట్ల వ్యయంతో, 90 లక్షల ఎకరాలకు నీళ్లివ్వాలనే మొక్కవోని దీక్షతో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేశారు. యావత్ ప్రపంచాన్నే తెలంగాణ దిక్కు తిప్పి ఔరా అనిపించేలా చేశారు. ఇంజినీరింగ్ అద్భుతాన్ని సృష్టించిన కేసీఆర్ ప్రభుత్వం దాని ఫలాలను సంపూర్ణంగా రైతులకు అందించడంలో ఏ మేరకు సఫలీకృతమైందంటే 'కాళేశ్వరం ప్రాజెక్టుకు ముందు తెలంగాణ, కాళేశ్వరం ప్రాజెక్టు తర్వాత తెలంగాణ' అనేవిధంగా వ్యవసాయ రంగంలో తెలంగాణను దేశంలోనే శిఖరస్థాయికి చేర్చింది.

తమ్మిడిహట్టి అసాధ్యమనే మేడిగడ్డకు రూపకల్పన: తమ్మిడిహట్టి వద్ద గోదావరిలో వరద లేనందున, ఉన్న పైరాష్ట్రాలు వినియోగించుకుంటున్న నీటి లభ్యత భవిష్యత్తులో ఉండొచ్చు, ఉండకపోవచ్చు అని నాటి కేంద్ర జల వనరుల సంఘం రాష్ట్రానికి సూచించింది. నాటి కేసీఆర్ ప్రభుత్వం గోదావరిలో ఉన్న నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని 240 టీఎంసీల నీరు లభించే మేడిగడ్డ వద్ద నాడు ప్రాజెక్టు నిర్మాణానికి అంగీకరించింది. మళ్లీ మహారాష్ట్ర ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 152 మీటర్ల ఎత్తులో ససేమిరా అన్నది. ఇది చరిత్ర. దీన్ని కాంగ్రెస్ పార్టీ తమ రాజకీయ స్వలాభం కోసం వాడుకొని ప్రజలను, మేధావులను సైతం తప్పుదోవ పట్టించి ప్రయోజనం పొందింది.

తెలంగాణ సమాజం ఆదినుంచి ఎదుర్కొంటున్న నీళ్లు, కరెంటు సమస్యలను అధిగమించడంలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన కృషిపై కక్షగట్టి విచారణ పేరుతో న్యాయ కమిషన్లను ఏర్పాటు చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం సందు దొరికితే కేసీఆర్‌ను బద్నాం చేయాలనే ప్రయత్నం చేస్తున్నది. అందులో భాగంగానే కాళేశ్వరం ప్రాజెక్టుపై మేలో జస్టిస్ పీసీ ఘోష్ అధ్యక్షతన కమిషన్ ఏర్పాటుచేసింది. విచారణలో భాగంగా కమిషన్ కుంగిన పిల్లర్లను రిపేర్ చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించడంతో ఒక్కసారి కంగుతిన్న కాంగ్రెస్ అంతర్మధనంలో పడిపోయింది.

కాళేశ్వరం ప్రాజెక్టు కాంగ్రెస్ కుట్రలను తట్టుకుని తెలంగాణ ప్రజల కోసం మళ్లీ నిలబడి ప్రస్తుతం ఒళ్లంతా పులకరించేలా 10 లక్షల క్యూసెక్కుల్లో వరద పరవళ్లు తొక్కుతూ ప్రవహించడం చూస్తుంటే అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వ పునాదులకు బీటలు పారక తప్పదు. తాగు, సాగునీళ్లకు దశాబ్దాలుగా గోస పడుతున్న తెలంగాణ ప్రజల ఆకాంక్షకు ఆయుష్షు అందిస్తూ ప్రాణం పెట్టి కట్టుకున్న మహోత్తర మానవ నిర్మాణమే కాళేశ్వరం ప్రాజెక్టు. బీటలు వారిన బీడు భూములకు, దాహార్తిని తీర్చిన గొంతులకు, తుమ్మలు మొలిచిన చెరువులకు, చేపలు పట్టిన ముదిరాజులకు, వ్యవసాయం చేసే రైతన్నలకు, అడుగంటిన బోరు బావులకు ఎరుక కాళేశ్వరం ప్రాజెక్టు చరిత్ర. ఓట్ల కోసం, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ ఆత్మగౌరవాన్ని నాటి నుంచి నేటివరకు ఢిల్లీ పెద్దలకు, ఆంధ్రా పెత్తందార్లకు తాకట్టు పెట్టిన నేటి కాంగ్రెస్ పాలకులకు ఏం ఎరుక కాళేశ్వరం ప్రాజెక్టు విలువ. కాళేశ్వర ముక్తేశ్వరుని సాక్షిగా నిర్మితమైన కాళేశ్వరం ప్రాజెక్టు ఎల్లవేళలా తెలంగాణకు వరప్రదాయినిగానే నిలుస్తుంది.

